క్లుప్తంగా

ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్ ఎత్తివేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐఎఫ్‌టీయూ నాయకులు అప్పలరాజు, నారాయణరావు, తదితరులు

పూసపాటిరేగ: అచ్యుతాపురంలో ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను ఎత్తివేయాలని ఏఐఎఫ్‌టీయూ నాయకులు అప్పలరాజు, రెడ్డి నారాయణరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రాజావీధిలో చలో అచ్యుతాపురం వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న చలో అచ్యుతాపురం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

- డీఎఫ్‌ఓ కొండలరావు



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ కొండలరావు

పూసపాటిరేగ: వన్యప్రాణులను సంరక్షించాలిస్న బాధ్యత అందరిపైనా ఉందని డీఎఫ్‌ఓ కొండలరావు అన్నారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా తీరప్రాంత గ్రామాలైన తిప్పలవలస, చేపలకంచేరు గ్రామాల్లో సోమవారం ఆయన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీరంలో వేట చేసినప్పుడు వలకు చిక్కిన అలివ్‌రిడ్లేలను సముద్రంలోనే విడిచిపెట్టాలని సూచించారు. తాబేళ్లు తినడం, చంపడం నేరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారులు, అప్పలరాజు, కేఎస్ రాజు, సెక్షన్ అధికారి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించండి..



తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న తూడెం గ్రామస్తులు

భోగాపురం: మండలంలోని తూడెం పంచాయతీ బసవపాలెం కూర్మయ్య చెరువులో ఉన్న ఆక్రమణలను తొలగించి తమకు ఉపాధి కల్పించాలని తూడెం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కూర్మయ్య చెరువులో సగం భాగాన్ని కొంత మంది వ్యక్తులు ఆక్రమించారన్నారు. చెరువు గర్భాన్ని చదును చేసి మొక్కలు వేశారని.. పంచాయతీ తీర్మానం లేకుండానే రోడ్డు కూడా వేసుకుంటున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.ఉపాధి పనుల్లో భాగంగా ఆక్రమణలు తొలగిస్తే తమకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గాలి రాజారెడ్డి, దువ్వ అప్పన్న, రీసు నరసింగరావు, అప్పారావు, గణేష్, దువ్వ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతర శోభ..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విజయనగరం జిల్లా కేంద్రంలో బాలాజీ జంక్షన్ వద్ద ఉన్న ఎల్లమ్మ తల్లి ఆలయానికి (చదురు గుడి) జాతర శోభ వచ్చింది. ఈనెల ఆరో తేదీన తొలేళ్లు.. ఏడో తేదీన సిరిమానోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి పుట్టను అందంగా ముస్తాబు చేశారు. సిరుల మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ఎల్లమ్మ తల్లి చదురు గుడి

భవన నిర్మాణాలకు సరళతరమైన విధానం

- రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ నాయుడు



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ నాయుడు

విజయనగరం: బహుళ అంతస్తుల నిర్మాణాలకు ప్రభుత్వం సరళతరమైన విధానాలు అందుబాటులోకి తీసుకువచ్చిందని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ పి. నాయుడు అన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఉభయ జిల్లాలకు చెందిన ప్రణాళికా సిబ్బంది, లైసెన్స్ టెక్నికల్ పర్సన్లు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణాలు అనుమతుల మేరకే చేపట్టాలన్నారు. భవన నిర్మాణాల అనుమతులను స్వీయ ధ్రువీకరణతో ఇకపై పొందవచ్చని చెప్పారు. లేఅవుట్లలో 40 అడుగుల రోడ్డుకు బదులు 30 అడుగుల రోడ్డు వేసేలా మార్పు చేశారన్నారు. అలాగే పార్కింగ్ స్థలాలను 750 స్క్వేర్ మీటర్ నుంచి 500 స్క్వేర్ మీటర్లకు తగ్గించడం జరిగిందని తెలిపారు. బహుళ అంతస్తుల నిర్మాణ అనుమతుల అధికారాలను వీఎంఆర్‌డీఏ నుంచి కమిషనర్‌కు బదలాయించారని చెప్పారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ వంటి అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లానింగ్ కార్యదర్శి ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మితమవుతున్న భవనాలను పరిశీలించాలని సూచించారు. అనుమతులకు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ డి. శ్రావణి, డీటీసీపీఓ జి. నాగలత, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ ఎం. వాణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సిబ్బంది

విమానాశ్రయానికి అంబేడ్కర్ పేరు..



భోగాపురంలో నిర్మాణంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలని బహుజన సమాజ్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎరుకొండ వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం. సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎరుకొండ వెంకటరావు మాట్లాడుతూ.. 2,700 ఎకరాల భూములను రైతుల నుంచి సేకరించి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ప్రస్తుతం నిర్మిస్తున్న ప్రహరీలపై విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అని రాయడం సరికాదన్నారు. అందరూ మెచ్చే ప్రపంచ మేధావి అంబేడ్కర్ పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు సీహెచ్ చిన్నారావు, బి. కామేష్, తదితరులు పాల్గొన్నారు. – భోగాపురం

కర్మయోగంపై అరుణాజీ దివ్యప్రవచనాలు



ఐదురోజుల కార్యక్రమాల వివరాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి ధవళ సర్వేశ్వరరావు, తదితరులు

విజయనగరం టౌన్: శ్రీమద్ భగవద్గీతలో మూడో అధ్యాయం, కర్మయోగంపై ప్రముఖ ఆధ్యాత్మిక శిరోమణి అరుణాజీ దివ్యప్రవచనాలు ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ టౌన్‌సెంటర్ లేఅవుట్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.15 గంటల వరకూ ఉంటాయని నిష్కామ ఫౌండేషన్ ప్రతినిధి ధవళ సర్వేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు కొత్తపేటలో ఉన్న మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతలో కీలకమైన భాగం కర్మయోగమని, ఫలాపేక్ష లేకుండా కర్తవ్యాన్ని నిర్వహించమని ఉపదేశిస్తుందన్నారు. కర్తవ్యమే ధర్మం, ఫలంపై ఆకాంక్ష వద్దనే సూత్రాన్ని పాటించడం ద్వారా మనిషి నిస్వార్థ జీవితం, శాంతి, మోక్షం సాధించగలడన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రవచన కర్త అరుణాజీ ఐదురోజుల పాటు నిర్వహిస్తున్న కర్మయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఎమ్.సూర్యకాంతం, వరహాలశెట్టి, పతివాడ కృష్ణమోహన్, ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ పత్రాల జారీ బాధ్యత నుంచి తప్పించాలి..



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం గంటస్తంభం: వేదాంత మల్టీనేషనల్ కంపెనీని ఫిట్‌నెస్ పత్రాల జారీ బాధ్యతల నుంచి తప్పించాలని ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ కె.సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 10న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. సోమవారం స్థానిక ఎస్‌పీఆర్ శ్రామిక భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఆర్టీఓ ఆఫీస్‌లో వెహికల్ ఫిట్‌నెస్, పొల్యూషన్, రెన్యువల్, రిజిస్ట్రేషన్ వంటి సేవలు అందేవన్నారు. అయితే తాజాగా వేదాంత అనే మల్టీనేషనల్ కంపెనీకి ఫిట్‌నెస్ బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల మోటార్ కార్మికులు, వాహన యజమానులకు తీరని నష్టం చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చలాన్‌ల పేరిట వేధించడం తగదన్నారు. ఆటో డ్రైవర్లపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్మోహన్, బి.రమణ, ఆటో యూనియన్ నాయకులు పాపారావు, రామునాయుడు, ఉమామహేశ్వరరావు, పైడిరాజు, లక్ష్మణరావు, సత్యనారాయణ, రమణ, శ్రీను, కిశోర్, చంద్రశేఖర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

10న వేలంపాట

విజయనగరం: రానున్న ఆర్థిక సంవత్సరంలో (2025 – 26) రోడ్డు మార్జిన్ ఆశీల వసూళ్లకు ఈ నెల 10న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్న వేలంపాటకు ఆసక్తి గలవారు హాజరు కావాలని పేర్కొన్నారు. బ్యాంక్ గ్యారెంటీ, సాల్వేన్సీ సర్టిఫికెట్, డిపాజిట్‌తో సహా హాజరు కావాలని కోరారు.

నగర అభివృద్ధికి సహకరించాలి

విజయనగరం: ప్రజలు ఆస్తి, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. శతశాతం పన్ను వసూలే లక్ష్యంగా ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ప్రజలు చెల్లించిన పన్నులతోనే నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పన్ను చెల్లించాలని స్పష్టం చేశారు. పన్నులను విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గాని, సచివాలయాలలో గాని నేరుగా చెల్లించవచ్చన్నారు. లేదా ఆన్‌లైన్ ద్వారా కూడా చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నమాజ్ పుస్తకాల పంపిణీ

భోగాపురం: ఉత్తరాంధ్రలోని ముస్లింలకు రంజాన్ మాసం సందర్భంగా ఉచితంగా నమాజ్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ముస్లింల సంఘ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తెలిపారు. మండల కేంద్రంలోని ముస్లిం కుటుంబాలకు సోమవారం నమాజ్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ఐదు పూటలా నమాజ్ చేస్తే ఆరోగ్యానికి మంచిదన్నారు.

'గాదె' విజయంపై హర్షం

దత్తిరాజేరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడంపై మండల పీఆర్టీయూ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన, పీఆర్టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.జగదీశ్వరరావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పరశురాం, మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి శంకరరావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన శ్రీనివాసులనాయుడు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. మళ్లీ ఉపాధ్యాయులు ఆయనపై నమ్మకం ఉంచి అంతా ఏకతాటిపై నడిచారని అన్నారు.

గాలిలో పదవుల్లోకి వచ్చేది టీడీపీ నాయకులే

చీపురుపల్లి: గాలిలో అధికారంలోకి రావడం, గాలిలో పదవులు పొంది కుర్చీల్లో కూర్చోవడం టీడీపీ సాంప్రదాయమేనని వైఎస్సార్‌సీపీ వలంటీర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు అన్నారు. సోమవారం శాసనమండలిలో విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఉద్దేశించి మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు గాలికి వచ్చారంటూ వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పు పట్టారు. ఎవరు గాలిలో పదవులు పొందుతున్నారో, ఎవరు ప్రజల మధ్యన ఉంటూ ప్రజాశీస్సులతో పదవులు తెచ్చుకుంటున్నారో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలుసునని చెప్పారు. బొత్స సత్యనారాయణ 1999లో ఎంపీ, 2004, 2009, 2019లో ఎమ్మెల్యే, మంత్రిగా కొనసాగారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పని చేశారన్నారు. బొత్సను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు.

సిరిమాను ఊరేగింపు

బొండపల్లి: ఎల్లమ్మ తల్లి పండగ సందర్భంగా మండల కేంద్రంలో ఈనెల 6వతేదీన సిరిమానోత్సవం నిర్వహించనున్నారు. పూజారి బొట్టా సత్యం ఆధ్వర్యంలో సోమవారం సిరిమానును సిద్ధం చేసి గ్రామంలో మేళతాళాల మధ్య ఊరేగించారు. గురువారం సాయంత్రం నిర్వహించే సిరిమానోత్సవానికి గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

మూడు రోజుల్లో సర్వే పూర్తి చేయాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య



హాజరైన కార్యదర్శులు

విజయనగరం: వర్క్ ఫ్రమ్ హోమ్, నాన్ ఎంఎస్ఎంఈ, మిస్సింగ్ సిటిజన్స్, జియో క్యాప్చరింగ్ వంటి సర్వేలను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. త్వరలో చేపట్టనున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, ఎమినిటీస్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా సాంకేతికోత్సవం

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రతిష్ఠ 2కే25' పేరుతో సోమవారం నిర్వహించిన సాంకేతికోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ (రైల్వే) డాక్టర్ సాయిబాబా అంకల, ఫార్మర్ ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచడానికి, పరిశ్రమ నిపుణులతో మమేకం కావడానికి, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో సివిల్ విభాగం బోధనా సిబ్బంది డాక్టర్ జి.అప్పానాయుడు, సీహెచ్.గిరిధర్‌కుమార్, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ముఖ్య అతిథిని సత్కరిస్తున్న ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది

ఆదాయం ఉన్నా...
సౌకర్యాలు సున్నా

- అభివృద్ధికి నోచుకోని పుణ్యగిరి దేవస్థానం
- ఏటా పెరుగుతున్న ఆదాయం
- అయినా వసతులు శూన్యం
- శాశ్వత మరుగుదొడ్లు, ఇతర నిర్మాణాలు లేని వైనం
- రాజకీయ చట్రంలో బోర్డులు
- అవస్థలు పడుతున్న భక్తులు



అభివృద్ధికి నోచుకోని పుణ్యగిరి క్షేత్రం



పుణ్యగిరి ఆలయ మార్గంలో స్త్రీల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరికి మాత్రం పుణ్యం దక్కడం లేదు. తరాలు మారినా ఇక్కడి ఉమాకోటిలింగేశ్వర స్వామి భక్తులకు తిప్పలు తప్పడం లేదు. ప్రకృతి ఒడిలో ఉన్న ఇక్కడి ఉమాకోటిలింగేశ్వరస్వామి ఆలయం కచ్చితంగా ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులకు, భక్తులకు నచ్చే దివ్యధామం. ఈ క్షేత్రాన్ని, ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల న్న లక్ష్యసిద్ధి పాలకుల్లో లేకపోవడంతో పుణ్యగిరి కునారిల్లుతోంది.

ఏటా పెరుగుతున్న ఆదాయం

భక్తులకు వసతులు, సౌకర్యాలు లేకున్నా, పట్టించుకునే నాథులు కరువైనప్పటికీ పుణ్యగిరికి మాత్రం ఏటా ఆదాయం పెరుగుతు నే ఉంది.ఆదాయం ఉన్నా భక్తులకు అవసరమైన తాగునీరు, వాడుక నీరు, మరుగుదొడ్లు విశ్రాంత గదులు, మెట్లమార్గంలో షెల్టర్లు, కేశఖండన శాల వం టి కనీస సౌకర్యాలు కల్పించాలన్న ఆలోచన ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధుల్లో లేకపోవడం బాధాకరం. 2023 శివ రాత్రి జాతరకు రూ.13,69,086, 2024లో రూ.14,85,419 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.15,08,069 ఆదాయం వచ్చింది.

కాకి లెక్కలతో ఖజానా ఖాళీ

శాశ్వతంగా తాగునీరు, వాడుకనీరుకు పైప్‌లైన్లు వేస్తే చలివేంద్రాల ఏర్పాటు ఖర్చు తగ్గుతుంది. టాయిలెట్ల నిర్మాణం చేపడితే తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదుల ఏర్పాటు, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. ఒక్కో ఏడాది ఒక్కో ప్రాంతంలో బారికేడ్లు నిర్మాణం చేస్తే ప్రతి ఏటా కొయ్యలు, మేకులు, దడుల నిర్మాణం పేరుతో చేసే వేల ఖర్చుకు కళ్లెం వేయవచ్చు. మెట్ల మార్గంలో మర మ్మతుల పేరిట ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కల్లో చూపిస్తున్నారు.

పర్యావరణం..పరిశుభ్రత దయనీయం

పుణ్యగిరిలో పర్యావరణం, పరిశుభ్రత దయనీయంగా ఉంది. పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలపై నియంత్రణ లేక కొండ అంతా చెత్త నిండు తోంది. భక్తులు, పర్యాటకులు తెస్తున్న పాలిథిన్ సంచులు, పారబోస్తున్న చెత్తతో పచ్చనైన కొండపై పర్యావరణం మంట గలుస్తోంది. నిత్యం వందలాది మంది వంట చెరకు వ్యాపారం కోసం కొండపై చెట్లు కొట్టేస్తుండడంతో కొండపై పచ్చదనం మాయమౌతోంది. రహదారుల పక్క ఎవెన్యూ ప్లాంటేషన్ చేస్తున్నా, పుణ్యగిరి మెట్ల మార్గం పక్కన మొక్కలు నాటాలన్న ఆలోచన ఫారెస్టు, దేవదాయ శాఖలు చేయకపోవడంతో జాతర వేళ మెట్ల మార్గంలో భక్తులు మండే ఎండల్లో అవస్థ పడుతున్నారు.

టూరిజం హబ్‌గా మారిస్తే మరింత ఆదాయం

ఏటా శివరాత్రి వేళ పుణ్యగిరి జాతరకు చుట్టు పక్క జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. కార్తికమాసంలో నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. విశాఖ– అరుకు రహదారిలో ఉన్న పుణ్యగిరిని టూరిజం హబ్‌గా మారిస్తే ఆలయానికి మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ఆలయ ట్రస్ట్ బోర్డులు రాజకీయ చట్రంలోనే ఉంటున్నాయి తప్ప దేవస్థాన అభివృద్ధికి ఏనాడూ పనిచేయలేదు. పుణ్యగిరిని ప్రముఖ పర్యాటక క్షేత్రంగా, టూరిజం హబ్‌గా మార్చేస్తానంటూ గతంలో, 2024 ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ఊదరగొట్టారు. కానీ ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదు. ప్రస్తుతం ఏపీ టూరిజం డైరెక్టర్‌గా ఉన్న మండల వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి, మూడవ ధపా ఎమ్మెల్యే అయిన కోళ్ల లలితకుమారి కూడా పుణ్యగిరి వైపు కన్నెత్తి చూడలేదు.

ప్రతిపాదనలు చేశాం

పుణ్యగిరి కొండపై శాశ్వత మరుగుదొడ్లు, మెట్ల మార్గంలో మంచి నీటి ట్యాంక్‌లు, విశ్రాంతి షెల్టర్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వాటిని ఎమ్మెల్యే ద్వారా ఏపీ టూరిజం బోర్డుకు పంపించాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

–కె.నాగేంద్ర, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, పుణ్యగిరి దేవస్థానం, ఎస్.కోట.